ప్రజాశక్తి
శుక్రవారం 27 డిసెంబర్ 2024 5
పార్వతీపురం మన్యం



మెడికల్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ ట్రేడ్లలో ఎయిర్‌మెన్ ఉద్యోగాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో మెడికల్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ ట్రేడ్‌ల్లో ఎయిర్‌మెన్‌గా చేరేందుకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అదనపు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ ట్రేడ్‌ల్లో ఎయిర్‌మెన్ ఉద్యోగాలు శాశ్వతమైన ప్రాతిపదికన నియామకం జరుగుతుందని, పెన్షన్ లభిస్తుందని ఆయన తెలిపారు. 2025 ఫిబ్రవరి 1,2 తేదీల్లో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా అభ్యర్థులకు కొచ్చిలో ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ద్వారా ఎంపిక జరుగుతుందని ఆయన వివరించారు. నోటిఫికేషన్ వివరాలు airmens-election.cdac.in వెబ్ సైట్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో వివరాలు చూడొచ్చని ఆయన పేర్కొన్నారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో యువత రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనాలని ఆకాక్షించారు.

సమ్మెనాటి ఒప్పందాలు అమలు చేయాలి

మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ ● మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

గత సమ్మె కాలం నాటి ఒప్పందాలను అమలు చేయకుంటే పోరాటం ఉధృతం చేస్తామని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 26 నుంచి జరిగిన 16 రోజుల సమ్మె జరిగి నేటికీ ఏడాది పూర్తయిందని, అయినా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదని విమర్శించారు. ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచకుండా వారిచే వెట్టి చాకిరీ చేయించి, కమిటీ వేసి చేతులు దులుపుకుందని అన్నారు. అనంతరం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజుకు వినతిని అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ సింహాచలం, పట్టణ కమిటీ నాయకులు ఎన్.శంకర్రావు, మామిడి శివ, బి.రాజేష్, శివప్రసాద్, పాపులమ్మ, ఇప్పలమ్మ పాల్గొన్నారు.

సాలూరురూరల్ : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు ఆధ్వర్యాన కార్మికులు, ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ పెరిగిన ధరలకు తగ్గట్టుగా ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ వయస్సు 62ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన రూ.75 వేలకు, అలాగే దహన సంస్కారాల ఖర్చులకు రూ.20వేలు, బీమా రూ.7లక్షలు పెంచేలా వెంటనే జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలన్నీ కార్మికులకు అందేలా జీవో ఇవ్వాలని, సంక్రాంతి వస్తున్నందున అన్ని పట్టణాల్లో కాంట్రాక్ట్ కార్మికులందరికీ సబ్బులు, నూనెలు, చెప్పులు, బట్టలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన విధంగా కాంట్రాక్ట్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని లేకుంటే, భవిష్యత్తులో జరిగే ఆందోళనకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సాలూరు కమిటీ అధ్యక్షులు రాముడు, శంకర్రావు, మీడియా ఇన్చార్జిలు రవి, శ్రీను, కమిటీ సభ్యులు పోలరాజు, వెంకన్న, పర్మినెంట్ కార్మికుల సంఘం నాయకులు వెంకట్రావు భోగిసు తదితరులు పాల్గొన్నారు.



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ : సమ్మె ఒప్పందాలు అమలు చేయనందునే దశలవారీ పోరాటాలే శరణ్యమని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగర పంచాయతీ కమిటీ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది సమ్మె నాటి ఒప్పందాలు అమలు చేయడంలో ప్రస్తుత అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ దశల వారి ఆందోళనకు భాగంగా ధర్నా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సిహెచ్ సంజీవి, కోశాధికారి పి.వేణు, పి.శ్రీదేవి, విమల, మధు, వి.ఆంజనేయులు, జయరాము, భాస్కరరావు, సాయి,తదితరులు పాల్గొన్నారు.





సాలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద, పాలకొండ నగర పంచాయతీ వద్ద ధర్నాచేస్తున్న మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు, నాయకులు

గ్రామస్తుల సమక్షంలోనే సర్వే సమస్యలను పరిష్కరించండి

ప్రజాశకి - పార్వతీపురంరూరల్

రైతుల భూములకు సంబంధించి ఎటువంటి సర్వే సమస్యలు లేకుండా సాధ్యమైనంత వరకు వారి సమక్షంలోనే పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తహశీల్దార్లకు, సిబ్బందికి సూచించారు. తద్వారా రైతులకు, గ్రామస్తులకు ఒక భరోసా కలుగుతుందన్నారు. మండలంలోని పుట్టూరులో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీసర్వేలో భూముల సబ్ డివిజన్ అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అక్కడే ఏర్పాటు చేసిన ల్యాండ్ మ్యాపుల ఆధారంగా రైతుల భూవివరాలను కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు. ఈ సదస్సుల ద్వారా ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. భూసమస్యల పరిష్కారం వెనువెంటనే జరిగేలా అధికారులు చొరవ చూపాలని, అర్జీదారుల నుంచి స్వీకరించిన వినతులకు రశీదును అందించాలని అన్నారు. సదస్సులో వచ్చిన అర్జీపై తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యకు తగిన పరిష్కారం చూపేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. భూముల జాయింట్ ఎల్‌పిఎం సబ్ డివిజన్లకు సంబంధించిన సర్వే సమస్యలను గ్రామస్తుల సమక్షంలోనే నిర్వహించాలని సూచించారు. పరిష్కారమైన సబ్ డివిజన్ల వివరాలను తప్పక ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, తహశీల్దారు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న రైతులు

తడిసిన ధాన్యాన్ని కొంటాం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం వల్ల దెబ్బతిన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర గిరిజనశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. విజయవాడ నుంచి ఆమె ఫోన్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. రానున్న 24 గంటల్లో తేలిక నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించిన నేపథ్యంలో అధికారులను అప్రమత్తంగా వుండమని తెలిపామన్నారు. కోసిన పంటలను కాపాడ్డానికి సరైన వసతులు కల్పించాలని, ధాన్యాన్ని మిల్లులకు తరలించి, అవసరమైన చోట టార్పాలిన్లను ఏర్పాటు చేయాలని సూచించామని తెలిపారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పంటలను పరిశీలించి నష్ట అంచనా వేయమని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

రంగుమారిన ధాన్యాన్ని కొనాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - కురుపాం


తడిసి, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జియ్యమ్మవలస మండలంలో గల బొమ్మికలో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని సిపిఎం మండల కార్యదర్శి కూరంగి సీతారాంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిచి రైతులు ఇబ్బందులుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి, ధాన్యం వర్షాల పాలుకావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు, ప్రభుత్వం స్పందించి రైతుల వద్ద ఉన్న తడిచి మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే జియ్యమ్మవలస మండల కేంద్రంలో గల రైస్ మిల్లు తడిచిపోయిన ధాన్యానికి అదనంగా 5 కేజీలు ధాన్యం కావాలని అడుగుతున్నారని, ఇప్పటికే రైతుల నుంచి క్వింటాకు 6 కేజీల ధాన్యం అదనంగా తీసుకుంటున్నారని, ఇప్పుడు అదనంగా మరో 5 కేజీలు ధాన్యం లాగేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఆ రైస్ మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకొని తడిచి మొలకలు వచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్‌లో రైతులను కదిలించి పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామంలో గల రైతులు పాల్గొన్నారు.



మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పాలకొండ: తుపాను వల్ల నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలని కోరుతూ రైతుసంఘం మండల కమిటీ ఆధ్వర్యాన స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు మాట్లాడుతూ తడిచిన, మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని నిబంధనలను సడలించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. వరి, పెసలు, మినుములు పాడైపోయాయని, వరి కుప్పలు నాని పోయి ముద్దయ్యి మొలకెత్తాయని, కావున నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల అప్పగించాలన్న ఉద్దేశంతో నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని తీసుకొచ్చిందని, దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై రాజకీయాలకతీతంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో గంగుల శ్రీనివాసరావు, కాయలు జయరామ్, మచ్చ విజయ్, మునుకోట అప్పన్న, భాస్కర్ రావు, అల్లు కోటేశ్వరరావు, నెల్లి సూర్యనారాయణ, కె.చిట్టిబాబు, కరణం రవి, ఉంగరాల ప్రసాదు పాల్గొన్నారు. ఈ ఆందోళనకు కసిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మండల కార్యదర్శి కాద రాము మద్దతు తెలిపారు.



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు, రైతులు

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన డిఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలలో విద్యను కొనసాగించిన పూర్వ విద్యార్థి కోరికాన రవికుమార్ రూ.5లక్షల విలువ గల వాటర్ ప్లాంట్‌ను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.తిరుపతినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ పాఠశాల రుణం తీర్చుకోవడమంటే ఇదేనని, పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ పి.కృష్ణమూర్తి, ఎంఇఒలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రవిప్రసాద్‌తో పాటు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, పాఠశాల పూర్వ విద్యార్థులు, రవికుమార్ మిత్రులు పాల్గొన్నారు.

చేయూతనిస్తే వంజరపుగూడ వనితలే వ్యాపారవేత్తలు

- చిరుధాన్యాలతో అనేక ఆహార ఉత్పత్తుల తయారీ
- రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ
- నేడు వైజాగ్‌లో మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వర్ధమాన పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ప్రభుత్వం తరచూ అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. జిల్లాలో లభ్యమయ్యే వ్యవసాయ, అటవీ ఉత్పత్తులతో అనేక రకాల చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు అవకాశాలు ఉన్నాయి. భారీ పరిశ్రమలు ఏర్పాటుకు పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలు ముందుకు రాకపోవచ్చు కానీ జిల్లా అధికారులు దృష్టి సారిస్తే మన్యం జిల్లాలో చాలా మంది గిరిజన మహిళలు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం వంజరపుగూడకు చెందిన నలుగురు గిరిజన మహిళలు కురుపాం మండలం రస్తాకుంటుబాయిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొంది చిరుధాన్యాలతో అనేక ఆహార ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. మొత్తం 15 మంది మహిళలు శిక్షణ పొందగా, చివరికి మర్రి నవ్య, వి.రమణమ్మ, ఎ.దమయంతి, ఎన్.సరస్వతి చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీలో స్థిరపడ్డారు. ఈ నలుగురూ పెద్ద పెద్ద చదువులు చదవకపోయినా కృషి విజ్ఞాన కేంద్రంలో నేర్చుకున్న పాఠాల ఆధారంగా నేడు రకరకాల ఉత్పత్తుల తయారు చేస్తున్నారు. ఈ ఉత్పత్తులను అదే ప్రాంగణం లో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన దుకాణంలో విక్రయిస్తున్నారు. రాగులు, కొర్రలు, సామలు, ఊదలు, గంటెలు, అండుకొర్రలతో బిస్కెట్లు, చాక్లెట్లు, స్వీట్లు, శనగపప్పు చిక్కీలు తయారు చేసి అమ్ముతున్నారు. డిఆర్‌డిఎ ద్వారా వారు శిక్షణ పొందిన తర్వాత ఉత్పత్తుల తయారీ, విక్రయాలతో ఉపాధి పొందుతున్నారు.

మిల్లెట్ మేళాల్లో అవగాహన, అమ్మకాలు

జిల్లా వ్యవసాయ శాఖ చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించే ఒదుకు, సాగు విస్తీర్ణం పెంచేందుకు పలు ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ప్రస్తుతం చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తుల వినియోగం పెరగడంతో ప్రభుత్వం వీటి సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులకు అవగాహన కల్పిస్తోంది. సాగు చేసే రైతులకు రాయితీలు కూడా కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు చోట్ల మిల్లెట్ మేళాలను నిర్వహిస్తోంది. ఈ మేళాల్లో చిరుధాన్యాల సాగు ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించడంతో పాటు వాటితో తయారైన ఆహార ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఈ మేళాల్లో వంజరపుగూడ మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఒక్కో మేళాలో సగటున రూ.15వేల వరకు ఉత్పత్తుల ను విక్రయిస్తున్నారు. మేళాలు లేని రోజుల్లో రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం వద్ద ఉన్న దుకాణంలో రోజుకు రూ.5వేల చొప్పున ఉత్పత్తుల విక్రయాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి చేయూత నిస్తే ఈ వంజరపుగూడ వనితలే వ్యాపారవేత్తలుగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఎలా ప్రోత్సాహించాలి:

చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తుల తయారీ చేస్తున్న మహిళలకు అవసరమైన యంత్ర సామగ్రిని సమకూర్చి, ఆహార ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే వారే మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంది. ఈ నలుగురితో పాటు మరికొంతమంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం కలుగుతుంది. ఇప్పటికే వీరు తయారు చేసిన ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. తగిన ప్రచారం లేక ఈ ఉత్పత్తుల గురించి పెద్దగా తెలియని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం గాని, జిల్లా యంత్రాంగం గాని ఈ ఆహార ఉత్పత్తుల తయారీకి అవసరమైన యంత్ర సామగ్రి సమకూర్చి వాటి వినియోగం గురించి ప్రచారం చేయాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో వీరు తయారు చేసిన ఉత్పత్తులను స్నాక్స్ గా విద్యార్థులకు పంపిణీ చేయాలి. ప్రభుత్వ పరంగా నిర్వహించే సమీక్ష సమావేశాలు, జిల్లా, మండల సమావేశాల్లో స్నాక్స్‌గా ఈ ఉత్పత్తుల వినియోగం పెంచితే ఇదో పెద్ద పరిశ్రమగా రూపుదిద్దుకునే పరిస్థితి ఏర్పడుతుంది. జిల్లా యంత్రాంగం ఈ గిరిజన మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేసే ప్రణాళికలు రూపొందించాలని పలువురు కోరుతున్నారు.



మిల్లెట్స్ తయారీలో శిక్షణ పొందుతున్న మహిళలు

యంత్ర సామగ్రి సమకూర్చాలి : మర్రి నవ్య, వంజరపుగూడ

మేము చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తుల తయారీ గురించి రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం లో శిక్షణ పొందాం. అనంతరం అక్కడే ఉత్పత్తుల తయారీ చేస్తూ జీవనోపాధి పొందుతున్నాం. అయితే సొంతంగా తయారు చేసుకోవడానికి అవసరమైన యంత్ర సామగ్రిని ప్రభుత్వం సమ కూర్చాలి. మేము తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి.

వసతిగృహాల్లో స్నాక్స్ గా పంపిణీ చేయాలి : ఎన్.దమయంతి, వంజరపుగూడ

మేము చిరుధాన్యాలతో తయారు చేసిన ఉత్పత్తులను వసతి గృహాల్లో స్నాక్స్‌గా విద్యార్థులకు పంపిణీ చేయడం ద్వారా మార్కెటింగ్ పెరుగుతుంది. ప్రభుత్వ పరంగా నిర్వహించే అధికారిక సమీక్ష సమావేశాల్లో కూడా స్నాక్స్‌గా ఈ ఉత్పత్తుల వినియోగం పెంచాలి. జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

రక్తహీనత నివారణకు 'ఆరోగ్య అమృత' కిట్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో రక్తహీనతతో (అనీమియా) బాధపడే గర్భిణీలకు ఆరోగ్య అమృత ఆహారం కిట్లను అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. అంగన్వాడీల ద్వారా ప్రతి గర్భిణీకి ప్రభుత్వం నుంచి పోషకాహారం అందించడం జరుగుతుందని, దీనికి అదనంగా ఎన్జీఒలు, మహిళా సంఘాల సహకారంతో ఆరోగ్య అమృత ఆహారం కిట్లను ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో స్వయం సహాయక బృందాల పాత్ర కీలకమని అన్నారు. జిల్లాలోని గర్భిణీల్లో రక్తహీనత నివారణ, విడివికెల నిర్వహణ, పిఎంఇజిపిలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం కలెక్టర్ సమావేశ మందిరం నుంచి సమీక్షించారు. జిల్లాలో 2025 జనవరి 1 నుంచి అనీమియా ఏక్షన్ కమిటీ (ఏఏసి)లు పనిచేస్తాయని, అనీమియాను పూర్తిగా నిర్మూలించేందుకు కొంత సమయం పట్టనున్నందున, ఈలోగా సగానికి పైగా కేసులు తగ్గేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎపిఎంలను ఆదేశించారు. ప్రతి మండల, గ్రామ సచివాలయ స్థాయిలో ఉండే అనీమియా ఏక్షన్ కమిటీలు దీనిపై కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అన్నారు. అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకవిలువల ఆహారంతో రక్తహీనత ఉండబోదని, అయినప్పటికీ అనీమియా ఉన్నందున ఈ అదనపు కిట్లను అందించనున్నట్లు తెలిపారు. విడివికెల ద్వారా జీడి పరిశ్రమలను నెలకొల్పేలా ఆలోచన చేస్తున్నామని, ఇందుకు పార్వతీపురం, పాచిపెంట ప్రాంతాల్లో స్థలాలను గుర్తించినట్లు చెప్పారు. ఏడాది కాలం వరకు క్రయ విక్రయాలు జరగాలని, ఇందుకు అవసరమైన మెటీరియల్, గోడౌన్, ఇతరత్రా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన యంత్ర సామాగ్రిని అందించి, వాటిపై తగిన శిక్షణను మహిళలకు ఇప్పించాలని తెలిపారు. విడివికెల్లో తయారైన వస్తువులకు ఆకర్షణీయమైన ప్యాకింగ్, మార్కెటింగ్ సదుపాయం, బ్రాండింగ్ వంటివి కల్పించాలని ఎపిఎంలను కలెక్టర్ ఆదేశించారు. కుట్లు, అల్లికలు వచ్చే మహిళలకు కుట్టు మిషన్లను మంజూరు చేస్తామని, డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో తొలి ప్రాధాన్యతను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పిఎంఇజిపి పథకం కింద ప్రతి మండలంలో ఒక యూనిట్ ను నెలకొల్పాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ వై.సత్యం నాయుడు, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎస్.మన్మధరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎం.వినోద్ కుమార్, ఎల్డీఎం ఎన్.విజయ్ సరూప్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి. కరుణాకర్, జిల్లా ఉద్యానవన అధికారి కెఎస్ వరప్రసాద్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పనుల పూర్తికి కృషి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపడుతున్న పనులు శర వేగంగా నాణ్యతగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని ట్రైబల్ వెల్ఫేర్ చీఫ్ ఇంజనీర్ (ఇఎన్‌సి) సబ్బం శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక ఐటిడిఎ ఇంజనీరింగ్ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ ఫేజ్-1లో 72 మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాళ్లకు రూ.43 కోట్లు మంజూరయ్యావని తెలిపారు. ఫేజ్-2లో 53 కమిటీ హాల్‌కు రూ.31 కోట్లు మంజూరయ్యావని తెలిపారు. ఈ పనులు జూన్‌కు పూర్తి చేస్తామన్నారు. ఆర్టికల్ 275లో 26 పనులకు రూ.25 కోట్లు మంజూరు కాగా, వీటిలో 12 పనులు పూర్తి చేశామని, మిగతా 14 వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. అలాగే మ్యాచింగ్ గ్రాంట్స్ పథకంలో 11 పనులకు రూ.21 కోట్లు మంజూరయ్యాయని,వీటిలో ఐదు పనులు పూర్తయ్యావని తెలిపారు. 92 గోకులాలకు రూ.20 కోట్లు మంజూరు కాగా, ఒక్కొక్క గోకులానికి రూ.22 లక్షలు కేటాయించామని తెలిపారు. 28 పూర్తయ్యాయని, మిగతావి జనవరికి పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఏకలవ్య పాఠశాలలో ట్రైబల్ వెల్ఫేర్ 14 పాఠశాలలో నిర్వహించగా ఏడు పాఠశాలలు పూర్తయ్యావని తెలిపారు. జూన్‌ు పూర్తి చేస్తామన్నారు. స్థానిక ఐటిడిఎ పరిధిలో 146 వివిధ పనులకు రూ.109 కోట్లు మంజూరైందని, వీటిలో 25 పనులు పూర్తి చేశామని, మిగతా 114 వివిధ దశలో ఉన్నాయని తెలిపారు. ఆయనతో పాటు ఇఇ రమాదేవి, డిఇ సింహాచలం తదితరులు ఉన్నారు.



గొయ్యిపాండ్రలో మల్టీపర్పస్ భవన పనులను పరిశీలిస్తున్న ఇఎన్‌సి శ్రీనివాస్

31న డిఎస్‌పిసిఎ సమావేశం

పార్వతీపురం : జంతువులపై క్రూరత్వ నియంత్రణ కమిటీ సమావేశం ఈ నెల 31న నిర్వహించ నున్నట్లు జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్ మన్మథ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఈనెల 31న కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుం దని, సంబంధిత అధికారులు, సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు. గోశాల మంజూరు, నిర్మాణం, అక్రమ పశు రవాణా, కోడి పందేల నివారణ, విద్యా సంస్థల్లో జంతు దయ క్లబ్ ఏర్పాటు, సామాజిక బాధ్యతతో జంతు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలతో సమావేశం జరుగుతుందని చెప్పారు.



నిరసన దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు మురళీమోహనరావు

ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి

దీక్షా శిబిరంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహనరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరి విడనాడాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు కోరారు. 38వ రోజు నిరసన కొనసాగించిన నిరసన దీక్షలు నుద్దేశించి గురువారం మురళీమోహన్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వం సమస్యను జఠిలం చేయకుండా పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్ల పేద గిరిజన విద్యార్థులు చదువులు కోల్పోయిన పరిస్థితి వచ్చిందని అన్నారు. గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో ఉపాధ్యాయులు దివాకర్, రమేష్, వెంకట్, తిరుపతి నాయుడు, శ్రీను, జగదీష్, జ్యోతి, లక్ష్మి, కళ్యాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

30న సీతంపేట గురుకుల కళాశాలలో డెమో

సీతంపేట : స్థానిక ఐటిడిఎ పరిధిలో గల భామిని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో ఈ విద్యా సంవత్సరంలో గెస్ట్ టీచర్ ప్రాతిపదికన పిజిటి ఎకనామిక్స్ పనిచేయుటకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 30న సీతంపేట బాలుర గురుకుల రెసిడెన్షియల్ కళాశాలలో సర్టిఫికెట్స్ పరిశీలన, డెమో నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి అంకిత సురాన

ప్రజారక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజల రక్షణే ధ్యేయంగా విధి నిర్వహణలో పోలీసులు ముందుండాలని ఎస్‌పి అంకిత సురాన అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, కేసుల నమోదు, వాటి స్థితి గతులను అడిగి తెలుసుకుని పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్, ఆయుధ సామగ్రిని తనిఖీ చేసి సిబ్బంది కవాతు నైపుణ్యాన్ని పరిశీలించారు. ప్రతి రోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి గంజాయి, నాటుసారా అక్రమ రవాణా అరికట్టాలని, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గతేడాది వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం, నాటుసారాను ఎస్‌ఇబి సమక్షంలో నేలమట్టం చేశారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పర్యవేక్షిస్తూ, భద్రతా ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకొని అధికారులకు తగు సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ ఆంధ్రా- ఒడిస్సా సరిహద్దు స్టేషన్ కావడంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నాటు సారా అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టిసారించి అమ్మకాలపై దాడులు చేసి కేసులు నమోదు చేయాలని, కూనేరు చెక్‌పోస్ట్ వద్ద క్షుణ్ణంగా అన్ని వాహనాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. సంక్రాంతికి కోడిపందేళ్లు నిర్వహించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐ గోవిందరావు, ఎస్ఐ నీలకంఠం, పోలీసు సిబ్బంది ఉన్నారు.



బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ ప్రతాప్‌ను అభినందిస్తున్న నాయకులు

చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రతాప్

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక నగరపంచాయతీ చైర్మన్‌గా పల్లా ప్రతాప్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కోటదుర్గమ్మను దర్శించుకుని, అక్కడ నుంచి నగరపంచాయతీకి చేరుకొని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో చైర్మన్‌గా ఉన్న యందవ రాధాకుమారి రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న తనకు ఈ అవకాశం వచ్చిందన్నారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, తన సోదరుడు పల్లా కొండలరావు మద్దతుతోనే చైర్మన్ అయ్యానని తెలిపారు. పాలకొండ అభివృద్ధికి తాను కట్టుబడి ఉంటానని అన్నారు. కౌన్సిలర్లు అందర్నీ కలుపుకుపోతూ ఆయా వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాళి భాను, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నెన అప్పలనాయుడు, పట్టణ నాయకులు తమ్మారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాత్రునికోనేరు అభివృద్ధి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలోని 29, 30, 1, 2 వార్డుల ప్రజలకు ఎంతో అవసరమైనా పాత్రుని కోనేరును అభివృద్ధి చేసి, కోనేరు గట్టును వాకింగ్ ట్రాక్‌గా మార్చి ఆయా వార్డు ప్రజలతో పాటు పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలని సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు, బివి రమణ, సంచాన ఉమామహేశ్వరరావు, బంకురు సూరిబాబు డిమాండ్ చేశారు. గురువారం జగన్నాధపురంలోని పాత్రుని కోనేరును పరిశీలించి కోనేరు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నిరసన చేపట్టారు. సుమారు 6 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ కోనేరు అభివృద్ధికి నోచుకోక తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు, పాదచారులకు వాకింగ్‌ట్రాక్‌గా ఉపయోగించేందుకు ఎంతో అనువైన పాత్రుని కోనేరును అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఈ ప్రాంత పర్యటన సందర్భంగా పాత్రుని కోనేరు అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సబ్ జైలును తనిఖీ చేసిన డిఐజి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక సబ్ జైలును జైలు శాఖ డిఐజి ఎంఆర్ రవికిరణ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ జైల్లో మొక్కలు నాటారు. సబ్ జైల్ పరిసర ప్రాంతాలు తనిఖీ చేశారు. అనంతరం ముద్దాయిల యోగక్షేమాలు తెలుసుకున్నారు. వంట రూము, బాత్రూమ్‌లు, స్టోర్ రూమ్ పరిశీలించారు. రెండేళ్లకు ఒకసారి జరిగే సాధారణ తనిఖీలో భాగంగా ఈ సబ్ జైలును సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా జైలు శాఖ అధికారి కె.మోహన్‌రావు, జైలు సూపరింటెండెంట్ బి.జోగులు, సిబ్బంది ఉన్నారు.

10 వరకు ఎస్‌సి కులగణనపై సోషల్ ఆడిట్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఎస్సీ కుల గణనపై జనవరి 10 వరకు సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌సి జనాభా, వారి వివరాలు - పేరు, ఆధార్ నంబరు, పుట్టిన తేదీ, వయసు, ఉపకులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వత్తి, వ్యవసాయం, ఇతర వివరాల పై సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారని చెప్పారు. గురువారం నుంచి గ్రామ, వార్డు సచివాల యాల్లో ప్రదర్శన తదుపరి డిసెంబర్ 31 వరకు అభ్యంతరాల స్వీకరణ జరుగుతోందని ఆయన అన్నారు. జనవరి 10న కులగణన తుది వివరాలు పొందు పర్చనున్నట్టు చెప్పారు. డేటాపై అభ్యంతరాలను విఆర్ఒ స్వీకరిస్తారని, వీటిని మూడు దశల్లో తనిఖీ చేస్తారని తెలిపారు. వీటిని పునఃపరిశీలించి తహశీల్దారుకు సిఫార్సు చేస్తారన్నారు. తహశీల్దారు, విఆర్ఒ నివేదికలోని వివరాలు పరిశీలించి, తుది ఆమోదం తెలిపి ఆ వివరాల్ని పోర్టల్లో పొందు పరుస్తారని తెలిపారు. ఈ సోషల్ ఆడిట్‌ను పకడ్బందిగా నిర్వహించేందుకు నియోజక వర్గ స్థాయి, జిల్లా అధికారులను నియమిస్తామని తెలిపారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం ఢిల్లీకి చెందిన కర్త ఎన్జీవో సందర్శించారు. ఢిల్లీకి చెందిన కర్త ఎన్జీవో సంఘం పాఠశాలల స్థితిగతులను పరిశీలించారు. విద్యార్థులకు విద్యకు సంబంధించి సహాయసహకారాలు అందించడానికి ఆ సంస్థ ప్రతినిధి శాంశాంక్ మాలిక్, అపర్ణ కృషి చేస్తానన్నారు. విద్యా ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సీతంపేట గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యా ప్రమాణాలు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం తెలుసుకున్నారు. సౌకర్యాల గురించి ఆరా తీశారు.వీరితో పాటు ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి, ప్రిన్సిపల్ జి.నీలం నాయుడునాయుడు, ఆర్ట్ సంస్థ కోఆర్డినేటర్ బి శంకరరావు తదితరులు పాల్గొన్నారు .

సచివాలయాల్లో ఎస్‌సి జాబితా ప్రదర్శన


ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో గల అన్ని సచివాలయాల్లో షెడ్యూల్ కులాల (ఎస్‌సి)జాబితాను ప్రదర్శిస్తున్నట్టు ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి తెలిపారు. మండలంలోని బియ్యాలవలస సచివాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ షెడ్యూల్డ్ క్యాస్ట్ వ్యక్తుల వివరాలు సచివాలయంలో ఉన్న జాబితాలో పరిశీలించి తప్పులు తడకలుగా ఉన్న అభ్యంతరాలు ఈనెల 26 నుంచి జనవరి 6 వరకు స్వీకరిం చడం జరుగుతుందని తెలిపారు. జనవరి 10న చివర జాబితా ప్రచురిస్తామ న్నారు. కావున షెడ్యూల్ క్యాస్ట్ ప్రజలు గమనించి సరి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.రవణమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మండల విద్యా శాఖాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎంఇఒలతో సమీక్షించారు. ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణతలో జిల్లా ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. పాఠశాల వేళల్లో విద్యార్థులు అదుబాటులో ఉండాలని, వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలని తెలిపారు. పరీక్షల టైం టేబుల్ వచ్చిన నేపథ్యంలో ఏ విద్యార్థి కూడా ఆబ్సెంట్ ఉండరాదన్నారు. అలాగే ఉపాధ్యాయులు లేక తరగతులు జరగలేదనే పరిస్థితి ఉండకూడదని తెలిపారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల పట్ల ఎప్పటికప్పుడు ప్రధాన ఉపాధ్యాయులు, ఎంఇఒలు రాత్రి వేళల్లో సందర్శించాలని చెప్పారు. ప్రతి పాఠశాల, వసతి గృహంలోని మరుగుదొడ్ల పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు సమస్య ఉండరాదని తేల్చిచెప్పారు. పిల్లలకు ఏ సబ్జెక్టులో మార్కులు తక్కువగా వస్తే ఆ సబ్జెక్టుపై ఎక్కువ శ్రద్ధ చూపి మార్కులు బాగా వచ్చేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల రోజు వారి అటెండెన్స్ 95కు తగ్గకుండా ఉండాలని అన్నారు. పిల్లలు చదువుతున్నారా? లేదా? అనేది ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని, మౌలిక సదుపాయాలు, అకడమిక్ పెర్ఫార్మెన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఎంఇఒలకు గ్రేడింగ్ ఇవ్వాలని, టీచర్స్ ఆన్లైన్‌లో అటెండెన్స్ ఉండి, ఫిజికల్‌గా లేకపోతే చర్యలు తీసుకోవాలని డిఇఒను ఆదేశించారు. ఐదేళ్ల దాటిన అంగన్వాడీ పిల్లలను గుర్తించి ప్రైమరీ స్కూల్‌లో నమోదు చేసేలా చూడాలని, స్కూల్ నుంచి పిల్లలు డ్రాప్ ఔట్ అవ్వకుండా చూడాలన్నారు. అపార్ ఐడీలు వేగవంతం చేయాలని తెలిపారు. అనీమియాతో బాధపడుతున్న పిల్లలకు మాత్రలు వేయించడం, పోషకాహారం అందించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని పేర్కొన్నారు. భవిత కార్డులు ప్రతి పాఠశాలలో నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, ఎంఇఒలు తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పల్లెపండగ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

పిఆర్ ఇంజినీర్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

పల్లె పండగ కింద జిల్లాలో చేపడుతున్న పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్లను జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ చట్టం కింద చేపడుతున్న పల్లె పండగ, అంగన్వాడీల పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగలో మంజూరు చేసిన పనులన్నీ సంక్రాంతిలోగా పూర్తిచేయాల్సి ఉన్నప్పటికీ, ఈలోగానే అప్పగించిన లక్ష్యాలను సాధించాలని అన్నారు. ప్రతి వారం ప్రగతి ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రగతిలో వెనుకబడిన మండలాల వారీగా సమీక్షించిన ఆయన వచ్చే వారానికి ప్రారంభం కాని పనులు ఉండరాదని స్పష్టం చేశారు. పూర్తి చేసిన పనులకు సంబందించిన బిల్లులు ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, రోజు వారీ ప్రగతి తమకు తెలియజేయాలని తేల్చి చెప్పారు. పల్లె పండగ కింద చేపట్టిన బిటి, సిసి రోడ్లను తనిఖీ చేసి, నాణ్యత ప్రమాణాలను పరిశీలిస్తామని, నాణ్యత లోపం ఉంటే చెల్లింపులు జరగబోవని కలెక్టర్ వివరించారు. అంగన్వాడీ కేంద్రాలకు రంగులు వేయించి, బోర్డులను ఏర్పాటు చేయాలని, ఈ పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విక్రంపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టపూడివలస సచివాలయం పరిధిలో గల విక్రంపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, జ్వర పీడితులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీసా చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పీసా చట్టం, ఎన్నికల కోసం గుమ్మలక్ష్మీపురం అవగాహనా సదస్సును గురువారం నిర్వహించారు. గ్రామ సచివాలయం సిబ్బంది వీధి వీధికి వెళ్లి పీసా చట్టం ప్రాముఖ్యత, ప్రజలకు ఉన్న హక్కులను వివరించారు. కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ బిడ్డిక సంతోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'స్వమిత్వ' అమలుకు కృషి చేయాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పార్వతీపురం డివిజన్‌తో పాటు పాలకొండ డివిజన్లో అన్ని గ్రామాల్లోనూ స్వమిత్వ పథకం అమలుకు పంచాయతీరాజ్, రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే మ్యాప్ కోసం ఏర్పాటు చేసిన ఈ పథకం సామాజిక, ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆస్తి డేటాను సేకరించడమే లక్ష్యంగా చేపట్టే ఈ సర్వేలో డ్రోన్‌తో సహ వివిధ సాంకేతికతను ఉపయోగించడానికి అవకాశం ఉందని అన్నారు. ఈ పథకంపై పూర్తి అవగాహన పెంచుకొని సిబ్బంది ఈ కార్యక్రమం అమలుకు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో పాలకొండ, పార్వతీపురం డిఎల్‌పిఒలు నాగభూషణరావు, రాంప్రసాద్, సర్వే శాఖ ఎడి, ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

చండీగడ్ విద్యుత్తు కార్మికులకు సంఘీభావం

ప్రజాశక్తి - బలిజిపేట

చండీగడ్ డిస్కం విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యుత్తు కార్మికులకు సంఘీభావంగా గురువారం బలిజిపేటలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ చండీగడ్‌లో డిస్కంను ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ అయిన ఇమినేంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్‌కు అమ్మడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం, అక్కడి కార్మికులను పట్టించుకోకపోవడం అన్యాయమని అన్నారు. ఈ డిస్కంలో 500 మంది పర్మినెంట్, మరో 500 మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారన్నారు. ప్రతి ఏటా లాభాలు గడిస్తున్న ఈ విద్యుత్తు డిస్కంలను ప్రైవేటుపరం చేయడం మానుకోవాలన్నారు. వేలకోట్ల రూపాయలు లాభాలు గడిస్తున్న ఈ విద్యుత్తు డిస్కంలను అతిచౌకగా కార్పొరేట్లకు ప్రభుత్వం కట్టబెడుతుం దన్నారు.బిజెపి ప్రభుత్వం చండీగడ్ డిస్కం విద్యుత్ ప్రైవేటీకరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని, అక్కడి కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలియజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పాలిల అప్పారావు, సురేంద్ర, గేదెల సత్యనారాయణ, సత్యం, మూర్తి, గంగులు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వివిధ సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీయడంతో మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.రవణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత మండలంలో తాగునీటి సమస్యలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రామవరం, తామరకండి, పెదంకలాం, కృష్ణరాయపురం, లక్ష్మీపురం సర్పంచులు పెంట సత్యంనాయుడు, మూడడ్ల వెంకటనాయుడు, బి.శ్రీనివాసరావు, గుణుపూరు అన్నంనాయుడు, తుమ్మలపల్లి సత్యవతి మాట్లాడుతూ జలజీవన మిషన్ కింద మంజూరైన పైపులైన్లు వాటర్ ట్యాంకు ట్యాపులు నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో జరగలేదని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను నిలదీశారు. అలాగే వెంగళ్రాయి సాగర్ సంబంధించి 18ఎల్ కాలువ రామవరం, అంటిపేట రైల్వే లైన్ మధ్య ల్యాబ్ కల్వర్టు అవసరమే ఉందని పలుమార్లు రైతులు, సర్పంచ్ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ స్పందన లేదని అన్నారు. దీనివల్ల ఐదు గ్రామాలకు సాగునీరందక దాదాపు 50 ఎకరాల వరకు భూమి బీడుగా మారుతుందని, ఇది ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమేనని రామవరం సర్పంచి పెంట సత్యం నాయుడు నిలదీశారు. దీనికి ఇరిగేషన్ ఎఇ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో ప్రజా ప్రతినిధులకు, అధికారుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. కృష్ణరాయపురం సర్పంచ్ గుణుపూరు అన్నమయ్య మాట్లాడుతూ విద్యుత్ లైన్లు సరిచేయాలని ఎన్నిసార్లు చెప్పినా మార్చడంలేదని విద్యుత్‌శాఖ ఎఇని నిలదీశారు. దీనిపై ఎంపిడిఒ త్రివిక్రమరావు కలుగజేసుకొని సమస్యలన్నీ పరిష్కరించే దశగా చూస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, ఎంపిపి ప్రతినిధి బి.శ్రీరాములు నాయుడు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ వి.ఉమామహేశ్వరరావు, ఎపిఎం శ్రీరాములునాయుడు, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.



సమస్యలపై అధికారిని నిలదీస్తున్న సర్పంచ్

నరిసిపురంలో జిల్లా రిజిస్ట్రార్ పర్యటన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురంలో గురువారం రైతుల కోరికల మేరకు జిల్లా రిజిస్ట్రర్ కె.రామలక్ష్మి పట్నాయక్ పర్యటించారు. గ్రామంలోని రైతులు తమ పంట భూములు ఇప్పటికే అధిక ధరల్లో ఉన్నాయని, ఇంకా వాటి ధరలు పెంచితే క్రయవిక్రయాలు జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ధరల పెంపును నుంచి తమ గ్రామాన్ని మినహాంచాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె గ్రామంలో రైతులతో కలిసి భూములను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ తాను ఇక్కడ ఉన్న భూములను పరిశీలించానని, ప్రస్తుతం ఉన్న ధరలతో పాటు ధరలను పెంచితే రైతులు ఎదుర్కొనే సమస్యలను ఒక నివేదికగా ప్రభుత్వానికి సమర్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఎంపిటిసి వై.తవిటినాయుడు, మాజీ వైస్ ఎంపిపి గొట్టాపు గౌరి వెంకటరమణ గ్రామస్తులు పాల్గొన్నారు.

31న పార్వతీపురంలో యువజన ఉత్సవ్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా యువజన ఉత్సవ్ 2024ను ఈనెల 31న నిర్వహించనున్నట్టు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె వెంకట ఉజ్వల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా జనవరి 12న జాతీయ యువజనోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. ఈసారి జిల్లా యువజన ఉత్సవ్ కార్యక్రమం ఈనెల 31న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా నెహ్రు యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. జిల్లా యువజన ఉత్సవ్‌లో పాల్గొనే విద్యార్థులు, యువత ఆ రోజు 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జానపద నృత్యాలు, గీతాలు, రకరకాల పోటీలు నిర్వహిస్తామని అన్నారు. పోటీల్లో ప్రథమ స్థానంలో గెలుపొందిన విజేతలను రాష్ట్ర స్థాయిలో జరిగే యువజనోత్సవాలకు పంపుతామన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో గెలుపొందితే జనవరిలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఉత్సాహవంతులైన 15 నుంచి 29 ఏళ్ల గల యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారిలో అంతర్లీనంగా ఇమిడియున్న కళా ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని కోరారు. ఈ పోటీలకు అనుభవజ్ఞులైన వారిని న్యాయ నిర్ణేతలుగా ఎంపిక చేశామని అన్నారు.

ఈ పోటీల్లో మొదటి, ద్వితీయ, తతీయ స్థానాల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతి ఇవ్వనున్నట్టు తెలిపారు. సైన్స్ మేళా, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రూప్ ఈవెంట్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.7 వేలు, ద్వితీయ స్థానికి రూ.5 వేలు, తృతీయ స్థానానికి రూ.3 వేలు, వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.5 వేలు, ద్వితీయ స్థానికి రూ.1,500, తృతీయ స్థానానికి వెయ్యి రూపాయలు., యంగ్ రైటర్స్, యంగ్ ఆర్టిస్ట్స్, ఫోటోగ్రఫీ కంటెస్ట్ పోటీల్లో గెలిచిన వారికి ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.2,500, ద్వితీయ స్థానికి రూ.2,500, తృతీయ స్థానానికి రూ.1500 బహుమతిగా అందజేస్తామన్నారు. యువ ఉత్సవ్ పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులందరికీ సర్టిఫికెట్లు అందిస్తామని ఆ ప్రకటనలో వివరించారు.

సబ్సిడీ పెట్రోల్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం

శారీరక వికలాంగులు సొంత వ్యాపారం చేస్తున్నా, లేదా గుర్తింపు కలిగిన ప్రవేటు సంస్థల్లో పనిచేస్తున్న వారికి సొంత మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనం కలిగి ఉంటే పెట్రోల్ సబ్సిడీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత గల శారీరక దివ్యాంగులు - విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్ణీత ధరఖాస్తు ఫారము పూర్తి చేసి, ధరఖాస్తు ఫారంతో సదరం సర్టిఫికేట్, పెట్రోల్ కొనుగోలు చేసిన బిల్లులు, తెల్లరేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనము రిజిస్ట్రేషన్ దవీకరణ పత్రం (వికలాంగుని పేరుతో ఉండాలి), బ్యాంకు పాసు బుక్ మొదటి పేజీ, ఆధార్ కార్డు, వ్యాపారం లేదా ప్రవేటు సంస్థలో పని చేస్తున్న ధ్రువీకరణ పత్రం, ఒక పాస్ పోర్టు సైజ్ ఫోటో (వికలాంగత్వం కనుపడునట్లు) తదితర ధ్రువీకరణ పత్రాలతో సమర్పించాలని ఆమె కోరారు. వివరాలకు 08942-240519 ఫోన్ నెంబరుకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని ఆమె కోరారు.

కోటిపాం వంతెనకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

బ్రిటీష్ కాలంలో నిర్మించిన కోటిపాం వద్ద గల అంతర్‌రాష్ట్ర రహదారి జంఝావతి నదిపై ఉన్న వంతెన మరమ్మతులు పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆయన అధ్వానంగా గోతులు ఏర్పడి ఉన్న వంతెనను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం నుండి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే రహదారి మార్గంలో గోతులు కప్పారు తప్ప 90ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జికి నేటికీ పూర్తిగా మరమతు పనులు చేయకపోవడం అన్యాయమని అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ గోతుల్లో చిన్నచిన్న వాహనదారులు పడి క్షతగాత్రులవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోటిపాము బ్రిడ్జి వద్ద రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు.

విఆర్‌ఒల సంఘం మండల అధ్యక్షులుగా శ్రీనివాస్

ప్రజాశక్తి - వీరఘట్టం



అధ్యక్షునిగా ఎన్నికైనట్టు ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాస్

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మండల అధ్యక్షులుగా బాసూరు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారుల మండల సంఘం ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా పాలవలస నగేష్, ఉపాధ్య క్షులుగా ఊర్లక దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా రావుపల్లి చక్రధర్, సహాయ కార్యదర్శిగా కిక్కర సాయిరాం, కోశాధికారిగా చీపురుపల్లి ప్రభ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా ఎన్నికైన శ్రీనివాస్‌కు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఎన్నికల ధ్రువపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు విఆర్‌ఒలు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని పెద్దూరులో దెబ్బతిన్న మొక్కజొన్న పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి రేగిడి విజయభారతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ వర్షాల వల్ల పొలంలో నీరు నిలిచినట్లయితే, వీలైనంత త్వరగా బయటకు తీసుకోవాలన్నారు. అలాగే 19.19.19 ను ఎకరాకు రెండు కేజీల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. మొక్కజొన్నకు మొదలు కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున, వర్షాల అనంతరం మూడు గ్రాములు కాపర్ ఆక్సోక్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్ల వద్ద నేల తడిచేలా పిచికారీ చేయాన్నారు. పెసర, మినుములు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు బూడిద, ఆకుమచ్చ తెగుళ్ల వ్యాపించే అవకాశం ఉందన్నారు. కావున రైతులు ముందు జాగ్రత్త చర్యగా ప్రాపికొనజోల్ 1 మిల్లీలీటరు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని, తడిచిన వరికుప్పలకు 5శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. కారక్రమంలో విఎఎ తులసి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

వసతి గృహ విద్యార్థుల ఆరోగ్య వివరాల రికార్డులు పక్కాగా నిర్వహించాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా సిబ్బంది పర్యవేక్షణ చేయాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు సూచించారు. మండలంలోని జోగింపేటలో కెజిబివి, ఎస్‌ఒఇ వసతి గృహాలను గురువారం సందర్శించారు. విద్యార్థుల హీమోగ్లోబిన్ రక్తపరీక్షల నివేదికలను తరగతుల వారీగా రికార్డుల్లో పరిశీలించి తక్కువగా నమోదైన విద్యార్థుల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలతో మాట్లాడి ప్రతి రోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయిస్తున్నారా ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా అని తెలుసుకొని సిబ్బందికి తగు సూచనలు చేశారు. విధిగా ఐరన్ మాత్రలు విద్యార్థులకు వేయించాలని, పోషకాహారం సరిగా తీసుకునేలా పర్యవేక్షణ చేయాలన్నారు. సిక్ రిజిస్టర్ పరిశీలించి విద్యార్థుల ఆరోగ్య సమస్యల వివరాలు స్పష్టంగా ఉండాలని, ఆరోగ్య సమస్య, ప్రారంభ, నయమైన తేదీలు, చికిత్స ఇచ్చిన ప్రదేశం, చికిత్సా వివరాలు ఉండాలన్నారు. సిక్ రూమ్‌లో ఆరోగ్య సమస్యతో ఉన్న విద్యార్థితో ఆయన మాట్లాడి అందజేస్తున్న చికిత్సా వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. అక్కడ మందులు తనిఖీ చేశారు. వసతి గృహ హెల్త్ సిబ్బంది మందుల వినియోగం, కాలపరిమితి వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలించి నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న హెల్త్ స్క్రీనింగ్ ఏ మేరకు పూర్తయ్యిందని, ఏ విధమైన ఆరోగ్య సమస్యలు గుర్తించారని వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఆరోగ్య సమస్యలు గుర్తించిన విద్యార్థుల ఆరోగ్యం మెరుగు పడేవరకు, అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య,హాస్టల్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ధర్మరాజు, ఉమాదేవి, సూపర్వైజర్స్ సత్యవతి, శర్మ, వైద్య సిబ్బంది చైతన్య,మీనా తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌తో మహిళలకు స్వయం ఉపాధి

ప్రజాశక్తి -భామిని

టైలరింగ్ శిక్షణతో మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు దోహదం చేస్తుందని హోలీ క్రాస్ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. భామినిలో హోలీ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన 30 మంది మహిళలకు ప్రభుదాస్ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ మీరు స్వయం ఉపాధిని ప్రారంభించి మీ కుటుంబాలను ఆర్థికంగా నిలబెట్టుకోవాలన్నారు. ఈ శిక్షణ మొదటి అడుగు మాత్రమేనని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కందికొత్తల పండగకు ఎస్ఐకు ఆహ్వానం

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 29న గుమ్మలక్ష్మీపురంలో గల హెచ్ గ్రౌండ్ వద్ద నిర్వహించనున్న ఆదివాసీల కందికొత్తల పండగకు కందికొత్తల కమిటీ సభ్యులు టి.నాగభూషణ్, వి.తిరుపతిరావు గురువారం నీలకంఠాపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై నీలకంఠరావుకు ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా ఆదివాసీల సాంప్రదాయాలు ప్రకారం జరుపుకుంటున్న కందికొత్తల్లో గొడ్డలమ్మ, జాతరమ్మ దేవతల పూజలకు అధికారులకు ప్రజాప్రతినిధులకు ఆహ్వానించడం జరుగుతుందన్నారు

పత్రికా ప్రకటన

పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం పరిధిలో గల వైద్యాధికారి, జిల్లా కార్యక్రమ సమన్వయకర్త, జిల్లా PPM (పబ్లిక్ ప్రైవేట్ మిక్స్) కోఆర్డినేటర్, సీనియర్ DR-TB. TB-HIV సూపర్‌వైజర్ మరియు అకౌంటెంట్ పోస్టులు కోసం అర్హులైన అభ్యర్థులు ద్వారా దరఖాస్తులు వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కె విజయ పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు పార్వతీపురం జిల్లా కలెక్టర్ గారి కార్యలయం నందు దరఖాస్తు చేసుకుని ఈ నెల (డిసెంబర్) 27 & 28 తేదీలలో కలెక్టర్ కార్యాలయం వద్ద కార్యాలయ సమయాల్లో అవసరం అయిన విద్య అర్హతలు మరియు సర్టిఫికెట్లు తో హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు